# లెంపకాయ మంత్రం

మా మునిసిపాలిటీ శానిటరీ స్టాఫ్ కిందటేడు జీతాలు పెంచమని గొడవచేసి ఒకసారి ఒకరోజు, రెండోసారి రెండురోజులు 'పెన్‌డౌన్ స్ట్రయిక్' లాగా చీపుళ్ళు కిందపెట్టి సమ్మెచేశారు. మూడోసారి సమ్మె చేస్తే మూడురోజుల దుర్గంధం కదాని భయపడి మా స్పెషల్ ఆఫీసర్ గారు, ఎం. పి. గారు, ఎమ్మెల్యేగారు, కలెక్టర్‌గారు, పోలీస్ సూపరెంటుగారు లాంటి పెద్దలతో మీటింగ్ పెట్టి, అందులో పాల్గొన వలసిందిగా కోరుతూ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లమూ, శానిటరీ స్టాఫ్ యూనియన్ కార్యవర్గ సభ్యులమూ అయిన నన్నూ, దామోదరాన్నీ ఆహ్వానించేరు.

పాతబస్తీలో శానిటరీ అన్‌కీపింగు చాలా కష్టంగా వుందనీ కాలవలు సన్నం అని, రోడ్లు ఇరుకని, చాలా ఇళ్ళలో మరుగుదొడ్లు లేక జనం రోడ్లమీదనే దేహ బాధ తీర్చుకుంటున్నారని, కంట్రీ సైపు లెట్రిన్లెన్ని, కూపాలెన్ని అంటూ శ్టాటిస్టిక్సు పర్సంటేజీలు వివరించాడు దామోదరం. "మన మున్సిపాలిటీ త్వరలో కార్పొరేషన్ కాబోతున్నది. ఇళ్ళటాక్సులు, వృత్తి పన్నులు, లైసెన్సు ఫీజులు, ఆశీళ్లు వగైరా పెరుగుతాయి. కాబట్టి శానిటరీ స్టాఫ్ జీతాలు పెంచడం సమంజసం, మిక్కిలి న్యాయ"మని ఆ పెద్దల యెదట, దేవుని యెదట చెప్పినంత నిస్సంకోచంగా చెప్పాడు.

అందరూ చప్పట్లు కొట్టేరు. కాని జీతాలు పెంచడానికి గవర్నమెంటు ఆర్డర్సు కావాలన్నారు. అయితే, దసరా సందర్భంగా పారిశుద్ధ్య పోటీలు పెట్టి బహుమతు లివ్వడానిక నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. 'గుడ్‌వార్డ్ కీపింగ్ కాంపిటీషన్' అని దీనిపేరు. ఈ వూళ్ళో ముప్ఫయ్యారు వార్డులున్నాయి కదా! దసరా నాలుగు రోజుల్లో నాలుగు టీములు; నలుగురేసి న్యాయ నిర్ణేతలతో వార్డులన్నిట్లో

సమాచారంచేసి పరిశుభ్రంగా వున్న వార్డులను ఎన్నికచేసి; ఏ వార్డు మిక్కిలి శుభ్రంగా వుందో, ఏ వార్డు అతిశుభ్రంగా వుందో, ఏ వార్డు అతిమిక్కిలి పరిశుభ్రంగా వుందో నిర్ణయించి, మొదటి బహుమతి ఆ వార్డ్ శానిటరీ స్టాఫ్ అందరికీ గొడుగులు; రెండో బహుమతిగా సదరు వార్డు స్టాఫ్ అందరికీ గమ్ బూట్స్; మూడో బహుమతి వార్డు స్టాఫ్‌కి గ్లవ్స్ సెట్లు ఇస్తారు. కనుక, మీరందరూ ఇనుమిక్కిలి ఉత్సాహంతో పోటీ భావంతో పనిచేసి మీ మీ వార్డులను అత్యంత మిక్కిలి పరిశుభ్రంగా తీర్చిదిద్దండి, వెళ్ళండి" అన్నారు. కొత్త బస్తీ ఎటూ వెడల్పాటి రోడ్లతో టవున్ ప్లానింగ్ రూల్సు ప్రకారం శుభ్రం గానే వుంది. కనుక ఆ వార్డులో ఈ పోటీ అమలు జరగదని హామీ ఇచ్చారు.

"వార్డులు శుభ్రంగా వుండాలంటే ఇళ్ళు శుభ్రంగా వుండాలి. మనం క్లీన్ చేసే అవసరం రాకుండా గృహస్థులే వాళ్ళ యిళ్ళను, పరిసరాలను శుభ్రంగా వుంచుకుంటే?" అని ఆలోచించి; నేను దామోదరం, కృష్ణమూర్తి, జయచంద్రావు మొదలైన పాత బస్తీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లందరం మా వార్డుల్లో సంచార ప్రచారం చేశాం. "మీ గృహాలను, పరిసరాలను పరిశుభ్రంగా వుంచండి. ఉత్తమ గృహ నిర్వాహక బహుమతులిస్తాము" అని.

దసరా సందర్భంగా సిటీ బస్సులకు, తదితర వాహనాలకు రంగు జెండాలు కట్టినట్టే, పాతబస్తీ వార్డుల్లో ఇళ్ళు చాలావాటికి తోరణాలు, రంగు కాగితాల జెండాలు ఏర్పటయ్యాయి. కొండొకచో వెల్‌కమ్ బోర్డులు తయారయ్యాయి. బల్బులరంగులు కొన్ని వెలిసినా, మొత్తంమీద రంగు బల్బులు వెలిశాయి.

శానిటరీ స్టాఫ్ ఇన్‌స్పెక్టర్లు అందరం కూడా యూనిఫారాలు ఇస్త్రీలు చేయించుకుని తయారై దసరా రోజులన్నీ వార్డుల్లో గస్తీలు తిరిగాం.

"ఏమండీ ఇనస్పెక్టర్‌గారూ! మా ఇల్లు బావుందా? మాకు ప్రయిజ్ వస్తుందంటారా?" అని అడిగింది ఒక ఇల్లాలు.

"మీ ఇల్లు బాగానే వుందిగాని, మీ ఎదురిల్లు ఇంకా బావుంది. చూడండి!" అన్నాను చిరునవ్వుతో.

"అక్కడే మీరు తప్పటడుగు వేస్తున్నారు. శుభ్రంగా వుంచుకోవడం అంటే సినిమా సెట్టింగ్ వెయ్యడం కాదు. ద్వారాలకి రంగులవీ డిజైన్లవీ తెరలూ; లోపలా పైనా ట్యూబ్‌లైట్లూ; పెద్ద పెద్ద దేవుళ్ళ బొమ్మలూ, వాటి చుట్టూరా రంగు బల్బుల హారాలు అద్దెకి తెచ్చి అమర్చడం కాదు. రంగు డబ్బాలు దొంగతనాలు చేసి గోడలకీ, కిటికీలకీ పూసేసి రంగుల హంగు చెయ్యడం కాదు, నీట్‌గా వుంచుకోడం ప్రధానం. ఒక యింటికి పరిశుభ్రతకి మీరు బహుమతి ఇచ్చేరంటే ఆ ఇంటిని ఆ ఇల్లాలు ఏటా ఏడాది 365 రోజులూ అంత నీట్‌గా వుంచుతున్న భావం మీకు కలగాలి. మీ నిర్ణయాలు అయిపోయి మీరట్లా వెళ్ళగానే ఈ అద్దెకి తెచ్చిన హంగులన్నీ వెళ్ళిపోయి మళ్ళీ కిష్కింధ అయిపోతుంది ఆ ఇళ్ళలో. కావాలంటే చూడండి" అందావిడ.

"మరి వాళ్ళ గార్డెన్ బావుంది కదండీ" అన్నాను.

"అవును. మేం మేడమీది వాటాలో ఉన్నాం కనక మాకు గార్డెన్ లేదు. ఏదయినా పోటీ పెట్టినప్పుడు అవకాశాలు అందరికీ సమానంగా ఉండాలిగా?"

కొన్నాళ్ళయిపోయింది. వార్డులు చూడ్డానికెవ్వరూ రాలేదు. ఒక రోజు హఠాత్తుగా 'వార్డులు చూస్తారట' అని గుస గుస వ్యాపించింది. హడావుడిగా వార్డుల్లో కెళ్ళాం. ఆ క్రిందటి రోజునే దీపావళి మూలాన్ని వీధులన్నీ కాలిపోయిన మతాబా గొట్టాలతో, పుల్లలతో, టపాకాయల చెత్తతో, పగిలి పోయిన చిచ్చుబుడ్లతో, ప్రమిదలతో నానా బీభత్సంగా వున్నాయి. ఎంత ప్రయత్నించినా ఏమీ శుభ్రం కాలేదు.

ఇప్పుడు మా స్టాఫ్ జీతాలు పెంచమని ఆందోళన చెయ్యడం లేదు. పారిశుద్ధ్య బహుమతులు వస్తాయో రావో అని ఆందోళన చెందుతున్నారు.

(6-10-79)